## ఈతకా..జరభద్రం..!

-మృత్యుకుహరాలుగా మారుతున్న చెరువులు, వాగులు, కుంటలు






# ప్రజాపక్షం

PRAJAPAKSHAM

స్తంభాద్రి భద్రాద్రి

సోమవారం | 01 | ఏప్రిల్ | 2024

పేజీలు 6


# అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..!



### -రెవెన్యూ తీరుపై తీవ్ర విమర్శలు
### -సర్వే నెం.37లో ప్లాట్ల స్వాధీనంపై భిన్న స్వరాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రెవెన్యూ శాఖ ఎప్పుడు ఎలా వ్యవహరిస్తుందో అర్థం కాని పరిస్థితి. ఖమ్మం నగరానికి సమీపంలో 1997, 2005లో ఖానాపురం రెవెన్యూ సర్వే నెం. 37లో వైఎస్ఆర్ కాలనీ సమీపంలో సుమారు 439 మందికి పైగా స్వాతంత్ర్య సమరయోధులకు 144 గజాల చొప్పున నివాస స్థలాన్ని కేటాయించారు. పట్టాలిచ్చే దగ్గర నుంచి నిన్న మొన్నటి వరకు ఎప్పుడు వివాదమే తొలుత ఒక్కొక్కరికి 244 గజాల చొప్పున పంపిణీ చేశారు. ఆ తర్వాత సంఖ్య పెరిగిందని అదే భూమిని 144 గజాల చొప్పున పంపిణీ చేశారు. అయితే ఈ పట్టాల మార్పిడి ఆక్రమణలు, విక్రయాలు, కొనుగోళ్లు మొదటి నుంచి వివాదానికి దారి తీశాయి. స్వాతంత్ర్య సమరయోధులందరికీ ఒకే నమూనాలో పట్టాలు ఇవ్వడంతో పలువురు దొంగ పట్టాలను సృష్టించి నిజమైన స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను బెదిరించి స్థలాలను అక్రమించుకున్నారు. ఇక్కడ భూ కబ్జాలకు పాల్పడుతూ కొన్ని గ్యాంగులు హల్‌చల్ చేశాయి. నివాస స్థలాల ఆక్రమణలకు సంబంధించి ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. ఇందులో కొంత మంది స్వాతంత్ర్య సమర యోధులు, వారి వారసులు తమకు ప్రభుత్వం కేటాయించిన నివాస స్థలాలను అమ్మకాలకు పెట్టారు. ఖమ్మం నగరానికి దగ్గరలో ఉండడం, కాస్త చౌకగా దొరుకుతుండడంతో దిగువ మధ్యతరగతికి చెందిన పలువురు నివాస స్థలాలను కొనుగోలు చేశారు. ఈ నివాస స్థలాల్లో కొందరు తాత్కాలికంగా షెడ్లు నిర్మించడం, వాటికి కార్పోరేషన్ అధికారులు ఇంటి నెంబర్లు కేటాయించడంతో రిజిస్ట్రేషన్లు కూడా అయ్యాయి. అప్పట్లో లక్ష రూపాయల నుంచి మూడు లక్షల వరకు స్థలాల క్రయ, విక్రయాలు జరిగాయి. సగం మంది స్వాతంత్ర్య

మిగతా 2లో..

## కాంగ్రెస్ చేతకాని తనం వల్లే కరువు



### -తాగునీటికి రానున్న మరింత ఇబ్బంది
### -విద్యుత్ కోతలు తప్పక పోవచ్చు
### -మీడియా సమావేశంలో పువ్వాడ అజయ్
### -నామను గెలిపించండి : వద్దిరాజు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పాలన వైఫల్యం, చేత కాని తనం వల్లే రాష్ట్రంలో కరువు వచ్చిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు. కేసిఆర్ అంటేనే కాలువలు, చెరువులు, నదులని ఆయన లేకపోవడం వలనే నాలుగు నెలల్లో పరిస్థితి తారుమారైందని ఆయన తెలిపారు. ఆదివారం బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అజయ్‌కుమార్ మాట్లాడుతూ మన చేతుల్లో ఉన్న వ్యవస్థలను పదేళ్లుగా కాపాడుకున్నామని కానీ ఇప్పుడు వ్యవస్థలను కాపాడలేని స్థితికి కాంగ్రెస్ వచ్చిందన్నారు. పంటలు ఎండిపోవడమే కాకుండా తాగునీటి కరువు రానుందని మార్చి నెలలోనే పరిస్థితి ఈవిధంగా ఉంటే భవిష్యత్తు ఏమిటని అజయ్‌కుమార్ ప్రశ్నించారు. విద్యుత్ సమస్య కూడా తీవ్రం కానుందన్నారు. పంటలు ఎండిపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఖమ్మం నగర ప్రజలు మిషన్ భగీరథపై ఆధారపడ్డారని పాలేరులో అర టిఎంసి మాత్రమే నీరుందని వారం రోజుల్లో

మిగతా 2లో..

## పోడు భూముల కోసం
# గిరిజనుల మధ్య ఘర్షణ



### -ఘర్షణను నివారించడానికి ప్రయత్నించిన పోలీసులు
### -తిరగబడ్డ గిరిజనులు.. పలువురు పోలీసులకు గాయాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం/సత్తుపల్లి :** పోడు భూమి వ్యవహారం చిలికి చిలికి గాలి వానలా మారింది. పోడు భూమి తమదంటే తమదని రెండు వర్గాల మధ్య గిరిజనులు గత కొంత కాలంగా వాదులాడుకుంటున్నారు. ఆదివారం ఇరు వర్గాలు పరస్పరం ఘర్షణకు దిగడం నివారించే యత్నంలో పోలీసుల పైనే దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.... ఖమ్మంజిల్లా సత్తుపల్లి మండల పరిధిలోని రుద్రక్షపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని పోడు భూములకు సంబంధించి చంద్రాయపాలెం, బుగ్గపాడు గ్రామాల గిరిజనుల మధ్య చాలా కాలంగా పోడు భూమి వివాదం ఉంది. ఎప్పటి నుంచో ఉన్న పోడు భూమి తమదంటే తమదని ఇరు గ్రామాల గిరిజనులు తరచూ ఘర్షణ పడుతున్నారు. చంద్రాయపాలెం గిరిజనులు శనివారం నాడు

మిగతా 2లో..

# అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..!



(మొదటిపేజీ తరువాయి)

సమరయోధుల స్థలాలు పరాధీనమయ్యాయి. దశాబ్ద కాలంగా స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించిన స్థలాలలో క్రయ విక్రయాలు జరగడం పలువురు పోలీస్ స్టేషన్లను ఆశ్రయించడం అర్బన్ రెవెన్యూ అధికారుల వద్దకు పట్టాల పంచాయితీ వెళ్లడం జిల్లా అధికార యంత్రాంగానికి తెలిసిన విషయమే. ఈ ప్రాంతంలో ఘర్షణలు జరిగినప్పుడు కానీ, పోలీస్ కేసులు నమోదైనప్పుడు కానీ, నకిలీ పట్టాలు సృష్టించారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడమే కాకుండా మీడియాలో పలుమార్లు నకిలీ పట్టాల సృష్టికి సంబంధించి వార్తలు వచ్చిన రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించింది. మేము పట్టాలిచ్చాం మీరు కొట్టుకు చావండి అనే రీతిలో వ్యవహరించారు. ఇప్పటికీ ఆ పంచాయితీలు తెగ లేదు. కొందరు న్యాయస్థానాలను సైతం ఆశ్రయించారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం రెవెన్యూ అధికారులు ఈ ప్లాట్లలోని కట్టడాల మొత్తాన్ని కూల్చివేశారు. అసైన్డ్ చేసిన భూములు నిరూపయోగంగా ఉన్నాయని వాటిని స్వాధీనం చేసుకుంటున్నామని యంత్రాలతో వెళ్లి పునాదులు, తాత్కాలిక షెడ్లను కూల్చివేశారు. ఖమ్మం పక్కనే అర్బన్ రెవెన్యూ పరిధిలో దశాబ్ద కాలంగా ఇంత తతంగం జరుగుతున్నా పలుమార్లు రెవెన్యూ, పోలీసుల దృష్టికి సమస్య వచ్చినా ఉదాసీన వైఖరిని అవలంభించి ఇప్పుడు స్వాధీనం చేసుకోవడం పట్ల పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం నగరంలో ఉండటానికి కాస్త గూడు లభిస్తుందని తిని తినక కొనుగోలు చేసుకున్నామని ఇప్పుడు స్వాధీనమంటే మా పరిస్థితి ఏమిటని పలువురు పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్ద కాలంగా ఏ మాత్రం స్పందించకుండా ఇప్పుడు అది అసైన్డ్ భూమి ఖాళీగా ఉంది స్వాధీనం చేసుకుంటామంటే ప్రభుత్వ నిబంధనలు, భూచట్టాల ప్రకారం తప్పు లేదు కానీ నిరుపేదలు ఇప్పుడు ఆ కాస్త ఆశ్రయం లేకుండా పోవడం ఇన్ని రోజుల నుంచి మనకు కాస్త నివాస స్థలం ఉందిలే అనుకున్న వారు ఇప్పుడు ఏమి చేయాలో పాలుపోక లబోదిబోమంటున్నారు. అమ్ముకున్న వారు ఏంచక్కా డబ్బులు తీసుకుని ఏళ్లు గడిచిపోయింది. వారు ఇప్పుడు ఎక్కడ ఉంటున్నారో కూడా తెలియని పరిస్థితి. అసైన్డ్ భూముల్లో కేటాయించిన వారే ఉండాలని, నిరూపయోగంగా ఉంచరాదని హెచ్చరికలు చేయడం కొనుగోలు, విక్రయాలు నిషిద్ధమని కనీసం ప్రకటనలను చేయకపోవడంతో అమాయకులు ఇందులో బలయ్యారు. అధికార యంత్రాంగం ఇందుకు సంబంధించి కనీస ఆలోచన చేయాలని, ఆరుగాలం కష్టపడి రూపాయి రూపాయి వెనకేసుకుని కొనుగోలు చేసుకున్న నిరుపేదల పట్ల సానుకూల ధోరణిని అవలంభించాలని కోరుతున్నారు.

# పోడు భూముల కోసం గిరిజనుల మధ్య ఘర్షణ



(మొదటిపేజీ తరువాయి)

సత్తుపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించి తమపై అక్రమంగా అటవీశాఖాధికారులు, పోలీసులు కేసులు పెడుతున్నారని ఆరోపించి నిరసన తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం అటవీ శాఖాధికారులు పోడు భూమిని పరిశీలించేందుకు వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ఇరు గ్రామాల గిరిజనులు అక్కడకు చేరుకున్నారు. పోడు భూమిని పరిశీలించే నేపథ్యంలో గిరిజనుల మధ్య ఘర్షణ తలెత్తి ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. విషయం తెలుసుకున్న సత్తుపల్లి సిఐ కిరణ్ నలుగురు పోలీసులతో కలిసి సంఘటన స్థలంకు చేరుకున్నారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణను నివారించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆకస్మాత్తుగా గిరిజనులు పోలీసులపై దాడికి దిగారు. విచక్షణారహితంగా పిడి గుద్దులు గుద్దడమే కాకుండా కర్రలతో కొట్టారు. సిఐ కిరణ్ తో పాటు పోలీసులకు గాయాలయ్యాయి. అదనపు సిబ్బంది అక్కడకు చేరుకుని పలువురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులపై దాడికి పాల్పడడం సంచలనం సృష్టించింది. చంద్రాయపాలెం, బుగ్గపాడు గ్రామాలకు చెందిన 30 మంది గిరిజనులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వగ్రామానికి సమీపంలో జరగడంతో ఆయన ఈ ఘటనకు సంబంధించి ఆరా తీసినట్లు సమాచారం.

# కాంగ్రెస్ చేతకాని తనం వల్లే కరువు

(మొదటిపేజీ తరువాయి)

అవి కూడా అవిపోతే పరిస్థితి ఏమిటని పువ్వాడ ప్రశ్నించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో రేపటి నుండి నామ నాగేశ్వరరావు ప్రచారం ప్రారంభిస్తారని అజయ్‌కుమార్ తెలిపారు. నామ నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మీడియా సమావేశంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ జిల్లాలో పాలేరు రిజర్వాయర్ కింద ఎండిపోయిన పంటలను పరిశీలించామని కేసిఆర్ చెరువులు నింపి సాగునీటిని అందించి పంటలను కాపాడారని కాంగ్రెస్ ఆ పని చేయలేకపోయిందన్నారు. కేశవరావు పార్టీ మారడం సరైంది కాదని వద్దిరాజు తెలిపారు. కేసిఆర్ కేశవరావుకు ఉన్నత స్థానం కల్పించారని కానీ ఆయన పార్టీని వీడి వెళ్లారన్నారు. ఖమ్మం పార్లమెంటుతో పాటు రాష్ట్రంలో 14 పార్లమెంటు సీట్లను బిఆర్ఎస్ గెలుచుకోబోతుందన్నారు. ఖమ్మం పార్లమెంటు బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రైతు బిడ్డగా రైతుల కష్టాలు తెలిసిన వాడినని మీ సమస్యల పరిష్కారం కోసం తనను తిరిగి ఎంపిగా గెలిపించాలన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసిన రైతులు ఇప్పుడు బాధపడుతున్నారని నామ తెలిపారు. ఒక తడి నీరు అంది ఉంటే పంట చేతికొచ్చేదని ఎండిన పంటలను చూస్తుంటే బాధేసిందన్నారు. నాలుగు నెలల్లో రాష్ట్రంలో చాలా కష్టాలు వచ్చాయని నామ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్‌రావు, మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, మదన్‌లాల్, మెచ్చా నాగేశ్వరరావు, బానోత్ చంద్రావతి, మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

**ఎండిన పంటలను పరిశీలించిన బిఆర్ఎస్ బృందం...**

పాలేరు రిజర్వాయర్ పాత కాలువ కింద ఎండిపోయిన పంటలను ఆదివారం బిఆర్ఎస్ బృందం పరిశీలించింది. పాలేరు రిజర్వాయర్‌ను పరిశీలించిన అనంతరం నేలకొండపల్లి మండలంలో ఎండిపోయిన పంటలను పరిశీలించారు. రైతులను కలిసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేసిఆర్ ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని రైతులు అభిప్రాయపడుతున్నారని బిఆర్ఎస్ నేతలు తెలిపారు. బిఆర్ఎస్ బృందంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్, జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, పలువురు మాజీ ఎంఎల్ఎలు, ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న స్నేహితుడికి అండగా...



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఒక్కటి కాదు రెండు కాదు మూడు దశాబ్దాల స్నేహబంధం ఆపదలో ఉన్న స్నేహితుడికి అండగా నిలిచింది. తమ మిత్రుడు ఆపదలో ఉన్నాడని తెలుసుకుని తమ వంతు ఆర్థికసహాయం అందించి స్నేహ బంధం ఎప్పటికి చెరిగిపోదు అని నిరూపించారు.ఈ సంఘట ఆదివారం ఖమ్మం రూరల్ మండలంలో చోటు చేసుకుంది.పల్లెగూడెం గ్రామంలో మహాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం జెయ్యారం గ్రామానికి చెందిన బత్తిని రమేష్ దందపతులు కొద్ది సంవత్సరాల క్రితం జీవనోపాది నిమిత్తం ఈ ప్రాంతానికి వచ్చి జీవనం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రమేష్ కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు,ఇతర సమస్యల తలెత్తాయి. విషయాన్ని తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులైన జెయ్యారం వాసులు ఏ.ప్రసాద్, అక్కినపల్లి నరసయ్య, ఎల్డి శ్రీనివాస్, ఆర్ వెంకన్న, సులోచన, స్వరూప, వెంకమ్మ, పద్మలు, రమేష్ స్వగ్రహంకు వచ్చి మేమున్నాం అనే భరోస కల్పించారు. తమ వంతుగా రూ.20వేల ఆర్థికసాయం అందించారు. చిన్ననాటి స్నేహితుల చేసినసాయంపై మిత్రుని కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం కరువు తీసుకొచ్చింది..

**- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**

**- ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి పాలేరు రిజర్వాయర్ పరిశీలన**





**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** అబద్ధాలు,గోబెల్స్ ప్రచారంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన వెంట కరువును తీసుకువచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. నీళ్లు లేక ఎండిపోయిన ఖమ్మం జిల్లాలోని పాలేరునియోజకవర్గంలోని పాలేరురిజర్వాయర్‌ను ఆదివారం ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర,మాజీ ఎమ్మెల్యేలు సండ్రా వెంకట వీరయ్య, మదన్‌లాల్, శ్రేణులతో కలిసి పువ్వాడ అజయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వందరోజుల పాలన పూర్తి వైఫల్యం చెందారని, హామీలు అమలు చేసినట్టుగా ప్రచారం చేశారు తప్ప క్షేత్రస్థాయిలో శూన్యం అన్నారు. మా పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల కొనుగోలుపై పెట్టే దృష్టి ఓటు వేసి మిమ్మల్ని గెలిపించిన ప్రజలపై పెట్టాలని హితవు పలికారు. గేట్లు మా నాయకుల కోసం ఎత్తడం కాదని, ప్రజల దాహార్తిని తీర్చడానికి ఎత్తాలన్నారు. గ్రామాలలో చెరువులు, బావులు, బోర్లు ఎండిపోయి మంచినీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారన్నారు. పంట పొలాలకు నీరు లేక 175మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అవేదన వ్యక్తం చేశారు. మా నాయకుడు కేసీఆర్‌పై కోపం,తమ ప్రభుత్వం చేసిన మంచిపై అక్కసు చూపించేందుకు రైతుల జీవితాలతో ఆడుకోవద్దన్నారు. పాలేరు జలాశయం పూర్తిగా ఎన్నడు లేని విధంగా ఎండిపోయిందన్నారు. మార్చి నెలలోనే ఈ పరిస్థితి ఉంటే ఏప్రిల్,మేలలో ఇంతకంటే దారుణమైన పరిస్థితులు ఉంటాయన్నారు. ఈ మంచినీటి సమస్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుచూపులేకపోవడమే కారణంగా పేర్కొన్నారు. తక్షణమే సాగర్ జలాల ద్వారా పాలేరు జలాశయాన్ని నింపాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు,ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ నాయకురాలు చంద్రావతి, జడ్పీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బెల్లం వేణు, నాయకులు వేముల వీరయ్య, ఎండి ఆసీఫ్‌పాషా, వద్యా బాలకృష్ణ పాల్గొన్నారు.

# ఆధైర్యపడకండి..అండగా ఉంటాం...



**-రాష్ట్రంలో రైతులు, ప్రజలు కన్నీళ్లు పెడుతున్నారు..**
**-ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రాష్ట్రంలో సాగు, తాగు నీటి కోసం ప్రజలు, రైతులు కన్నీళ్లు పెడుతున్నారని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. మండలం లోని నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం లో ఆదివారం ఎండిన వరి పంట పొలాలను పరిశీలించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...కాంగ్రెస్ అసమర్థత వలన ఒక్క ఖమ్మం జిల్లాలోనే కాకుండా రాష్ట్రం అంతా సాగు, తాగు నీరు లేక అల్లాడుతున్నారని అన్నారు.అదే విధంగా గ్రామాలలో తాగునీరు లేక ట్యాంకర్ల ద్వారా తెచ్చుకునే దుస్థితి నెలకొందని అన్నారు. రాష్ట్రంలో రైతులు, ప్రజలు కన్నీళ్లు పెడుతున్నారని అన్నారు. ఒక్క తడి కి నీరు వదిలితే లక్షల ఎకరాల వరి పంట చేతి కొచ్చేది అన్నారు. రైతులు ఆధైర్యపడవద్దని..బీఆర్ఎస్ కు మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ అసమర్థత వలన ఈ దుస్థితి నెలకొందని అన్నారు. ఎండిన ప్రతి ఎకరానికి రూ.30 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్షుడు తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, జడ్పీ చైర్మన్ కమల్‌రాజు, వైస్ చైర్మన్ ధనలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, చంద్రావతి, డీసీసీబీ మాజీ చైర్మన్ కురాకుల నాగభూషణం, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల గురించి మాట్లాడే అర్హత నామకు లేదు..



**-గత పాలకుల నిర్లక్ష్యమే నీటి ఎద్దడికి కారణం**
**-రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు కు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం లో మాట్లాడారు....గత బీఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యం కారణ గానే జిల్లాలో నీటి సమస్య ఏర్పడిందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో లబ్ధిపొందేందుకు బీఆర్ఎస్ నాయకులు కొత్త డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. శాసనసభ ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెప్పిన విషయంను మరిచినట్లు ఉందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో కూడ అదే రిపీట్ అవుతుందని గుర్తుంచుకోవాలని అన్నారు. నామా నాగేశ్వరరావు ముందు ఆయన చెరుకు ఫ్యాక్టరీ కి చెందిన చెరుకు రైతుల బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎంపీగా ఉండి ఏ ఒక్క రోజు కూడ రైతుల సమస్యల పై చర్చించని నామా కొత్తగా రైతుల గురించి మాట్లాడుతుంటే హస్యాస్పదంగా ఉందని అన్నారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అన్నారు. బీఆర్ఎస్ పనైపోయిందని అన్నారు. టిక్కెట్లు ఇచ్చిన వారు పరారవుతున్నారంటే పార్టీ పరిస్థితి ని అర్థం చేసుకోవచ్చునని అన్నారు.ఈ విలేకర్ల సమావేశంలో నాయకులు రమ్య, శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, బచ్చలకూరి నాగరాజు, కోడాలి గోవిందరావు, మారుతి కోటి, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన శాస్త్రం ఉపయోగపడాలి



**-విజ్ఞాన శాస్త్ర అంశాలపై వినూత్న విశ్లేషణ**
**-తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రశంసాపత్రం అందచేత**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** విజ్ఞాన శాస్త్ర ఫలితం నిత్య జీవితంలో ఉపయోగపడాలని ప్రముఖ విద్యావేత్త లక్కినేని ప్రసాద్ అన్నారు. ఆదివారం విశ్వశాంతి విద్యాలయంలో విజ్ఞాన శాస్త్ర అంశాలపై 62 మంది విద్యార్థిని విద్యార్థులతో విశ్లేషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్య జీవితంలో మనకు తెలిసిన అనేక సాధారణ అంశాల వెనుకగల విజ్ఞాన విషయాలపై విశ్వశాంతి విద్యాలయం విద్యార్థులు జరిపిన వినూత్న విశ్లేషణ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదు చేశారు. ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో 62 మంది విద్యార్థులు నిత్య జీవితానికి సంబంధించిన 62 విషయాలను వివరిస్తూ, వాటి వెనుక గల సైన్స్ కారణాలను విశ్లేషణ చేస్తూ ఆయా అంశాలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించారు. శాస్త్రీయ వాస్తవాలు నిరూపణ కార్యక్రమం రెండు గంటలపాటు నిరంతరంగా కొనసాగింది. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులుగా ఖమ్మం నుండి శ్రీనివాస్, సత్తుపల్లి నుండి బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా సైన్స్ ఉపాధ్యాయులు ప్రసాద్, శేషుకుమార్ వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా 15వ బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సంస్థ తరపున తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసాపత్రాన్ని అతిథులు పాఠశాల యాజమాన్యానికి అందచేసారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికి వ్యక్తిగత ప్రశంసాపత్రాలను అతిథులు అందజేసారు. ఈ కార్యక్రమం పాఠశాల కరస్పాండెంట్ పసుపులేటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. విద్యావేత్త, విద్యాసంస్థల అధిపతి లక్కినేని ప్రసాద్ మాట్లాడుతూ సైన్స్ ద్వారా నేర్చుకున్న విజ్ఞానం నిత్య జీవితంలో ఉపయోగపడాలని కోరారు. పక్షులు ఎందుకు ఎగర గలుగు తున్నాయి, పాలు వేడి చేసినపుడు ఎందుకు పొంగుతాయి, రైల్వే ట్రాక్ పై కంకర ఎందుకు వేస్తారు. ఇలాంటి విషయాలు మన నిత్య జీవితంతో ముడిపడి ఉన్నా వాటి సైన్స్ మూలాలు మనకు తెలియవని అన్నారు. విశ్వశాంతి విద్యార్థులు చేసిన సైన్స్ విశ్లేషణ ఒక నూతన ఒరవడికి నాంది పలికిందన్నారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న 15 వ బెటాలియన్ కమాండెంట్ వెంకట రాములు మాట్లాడుతూ విజ్ఞాన విషయాలతో పాటు మాతృభాషలో నైపుణ్యాన్ని సాధించాలని విద్యార్థులకు సూచించారు. తెలుగు మాతృభాషను నేర్చుకుంటే తరువాత అనేక భాషలు అవలీలగా నేర్చుకో వచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్జీలుగా ప్రసాద్, శేషుకుమార్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, అంబేద్కర్ అతిథులుగా మధుసూదన రాజు, పాఠశాలలు యాజమాన్యం నుండి పసుపులేటి నాగేశ్వరరావు, సత్యనారాయణ, నీలాద్రి ఆలయ కమిటీ డైరెక్టర్ రామిశెట్టి శ్రీనివాస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శేషకుమారి మృతి పట్ల పువ్వాడ సంతాపం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ మంద కృష్ణ మాతృమూర్తి పొట్లూరి శేషకుమారి మృతి పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఖమ్మం నగరంలోని కృషి భవన్ వద్ద గల వారి నివాసంకు వెళ్లి మంద కృష్ణ కుటుంబాన్ని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, వల్లభనేని రామారావు, కాటా సత్యనారాయణ (బాబ్జీ), గోలి అనూప్ తదితరులు పాల్గొన్నారు.

## గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న పువ్వాడ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం మండలం బిఆర్ఎస్ అధ్యక్షులు వీరునాయక్ నూతన గృహప్రవేశ వేడుకకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హాజరయ్యారు. ఆదివారం మండల పరిధిలోని కెవి బంజర గ్రామంలో వీరు నాయక్ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హాజరై వీరునాయక్ దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామ నాయకులతో, కార్యకర్తలతో కొద్దిసేపు ముచ్చటించారు.

## ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి నందు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాజేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ పోస్టులు 6, అసోసియేట్ ప్రొఫెసర్లు 13, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 6, సీనియర్ రెసిడెంట్ 18 ఖాళీగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇట్టి ఖాళీలను వాక్ ఇన్ ఇంటర్వ్యూ పద్ధతిన ఎంపిక చేయబడతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఏప్రిల్ మూడున ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఖాళీలు, ఇతర వివరాలు కళాశాల వెబ్‌సైట్ www.gmckhammam.gov.in లేదా khammam.telangana.gov.in నందు పొందుపర్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్ ఆఫ్‌లైన్‌లో స్వీకరిస్తారన్నారు. దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూల ద్వారా జిల్లా సెలక్షన్ కమిటీ నేతృత్వంలో ఎంపిక చేసి నియమాక పత్రాలను అందజేయనున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

## మేఘాహోమియో వైద్యశిబిరం విజయవంతం



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని గొల్లపాడు గ్రామంలో అవేర్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్, ఖమ్మం జిల్లా హోమియో డాక్టర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన మేఘా హోమియో మెడికల్‌క్యాంప్ విజయవంతమయ్యింది. ఇందులో 279మందికి వైద్య సేవలను అందించి,ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ హరిరమేష్, డాక్టర్లు నరసింహారావు, రవికాంత్, స్వామి, దీపక్‌వర్మ, సుందర్, కళ్యాణ్, కృష్ణా, అర్జున్‌రావు, అవేర్ సిబ్బంది కోటిరెడ్డి, వీరాచారి, భారతి, మోహన్, సొందుమియా, జానీ, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అంజమ్మకు డాక్టరేట్ పురస్కారం



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురంపంచాయతీలోని సూర్యానగర్‌కు చెందిన మానవహక్కుల పరిరక్షణ ప్రజాసమితి జిల్లా అధ్యక్షురాలు తోటకూరి అంజమ్మకు గౌరవ డాక్టరేట్ పురస్కారం లభించింది. పలు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను ఏసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ వారు బహుకరించారు. దీనిని ఆదివారం తమిళనాడు రాష్ట్రం ఊసూరు క్లారిస్టా 5స్టార్ హోటల్‌లో అసిస్టెంట్ జడ్జి డాక్టర్ జె.హరిదాస్, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఏవి నాగేశ్వరరావు, డాక్టర్ ఎం రాజగోపాల్, డాక్టర్ శివప్ప చేతుల మీదుగా అందుకుంది. ఈ సందర్భంగా అంజమ్మ మాట్లాడుతూ...తనకు ఇచ్చిన గౌరవం మరింత బాధ్యతను పెంచిందన్నారు. సామాజానికి ఉపయోపడే మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడతానన్నారు.

## నేటి నుంచి కేంద్రీ విద్యాలయ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని పోలెపల్లిపంచాయతీ పరిధిలో గల కేంద్రీవిద్యాలయంలో 202425 విద్యాసంవత్సరానికిగాను 1వ తరగతిలో ప్రవేశాల కోసం నేటి నుంచి(ఏప్రిల్ 1) ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించనున్నారు. 1వ తేదీ నుంచి ఏప్రిల్ 15వ తేదీలోపులోపు దరఖాస్తు చేసుకోవచ్చునని షెడ్యూల్‌ను విడుదల అయ్యింది. మార్చి 31,2024తేదీ నాటికి 6ఏండ్లు నిండిన వారు 1వ తరగతి ప్రవేశాలు అర్హులు.రెండో తరగతుల్లో ప్రవేశాల కోసం ఆయా విద్యాలయాలోల ఖాళీలను అనుసరించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రెండోవతరగతి నుంచి ఆపై తరగతిలో ప్రవేశాల కోరకు ఆయా కేంద్రీయ విద్యాలయంలో గాని,అందుకు సంబంధించిన వైబ్‌సైట్ https://kvsangathan.in ను సంప్రందిచవచ్చు.

## యాదన్నకు పలువురి నివాళి



**ప్రజాపక్షం/ కారేపల్లి :** సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సీనియర్ నాయకులు, కామ్రేడ్ గండి యాదన్న శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతిపట్ల పలువురు నివాళులర్పించారు. ఆదివారం యాదన్న అంతిమ యాత్ర సందర్భంగా జరిగిన సంతాప సభలో మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ కామ్రేడ్ యాదన్న ఇల్లందు ప్రాంతంలో అనేక ప్రజా పోరాటాలు నిర్వహించారని తెలిపారు. బలమైన ప్రజా ఉద్యమ నిర్మాణంలో ఆయన పాత్ర కీలకమన్నారు. మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన యాదన్న ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి గిరిజనులు, పేదల సమస్యల పరిష్కారం కోసం విప్లవబాట పట్టారన్నారు. నిత్యం నిర్బంధాలు, అరెస్టులు, జైళ్లను ఎదుర్కొని ప్రజా ఉద్యమాన్ని కాపాడారని కొనియాడారు. పాటలు, కవితలు, నాటికలు రాయడం, నటించడం, పాడటం తదితర బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు తెచ్చుకున్నార న్నారు. ఆయన మృతి సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్‌కు తీరని లోటన్నారు. ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కె. రంగయ్య, రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ, మాజీ ఎంఎల్‌ఏ గుమ్మడి నర్సయ్య, చిన్న చంద్రన్న, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, నాయిని రాజు, మాచర్ల సత్యం, జాటోత్ కృష్ణ, సావిత్రి, సుభాష్ చంద్రబోస్, యాకూబ్, ఎన్డి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మధు, తుపాకుల నాగేశ్వరరావు, సీతారామయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు దొడ్డా డానియేల్, సిపిఐ, సిపిఎం నాయకులు దేవరకొండ శంకర్, నాగయ్య, కిరణ్, వివిధ పార్టీల నాయకులు పరుచూరి వెంకన్న, సంజీవరెడ్డి, నాగరాజు తదితరులు యాదన్నకు నివాళులర్పించారు.

## నిరుపేద ముస్లింలకు విజేత ఫౌండేషన్ ఆసరా



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నిరుపేద ముస్లిం కుటుంబాలకు విజేత ఫౌండేషన్ ఆసరాగా నిలిచింది. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఆదివారం విజేత ఫౌండేషన్ అధినేత్రి, ఖమ్మం జిల్లా మహిళా ప్రాంగణాధికారి వేల్పుల విజేత ఆధ్వర్యంలో 65 మంది నిరుపేద ముస్లింలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంజాన్ మాసం దాన ధర్మాలు చేసే ప్రత్యేక మాసమన్నారు. పేద ముస్లింలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు సేమియా, డ్రై ఫ్రూట్స్ వంటి కిట్లను పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు.

## సమాజాభివృద్ధిలో గురువు పాత్ర కీలకం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సమాజాభివృద్ధిలో గురువు పాత్ర కీలకమని జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత అన్నారు. ఆదివారం మోరంపల్లిబంజర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం కొండ్రు వెంకటేశ్వర్లు పదవి విరమణ సన్మాన సభ నిర్వహించారు. ఈ సభకు జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత హాజరై పదవి విరమణ సందర్భంగా కొండ్రు వెంకటేశ్వర్లు దంపతులను ఘనంగా సన్మానించి, మెమొంటోను అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి చాలా బాధ్యత కలిగిందన్నారు. ఉపాధ్యాయుడు ఎన్ని కష్ట నష్టాలు వచ్చినా వృత్తి నిర్వహణలో రాజీ లేకుండా పని చేస్తాడని తెలిపారు. ఎవరికైనా వారు అందించిన సేవలు గుర్తింపు నిస్తాయన్నారు. పదవి విరమణ అనంతరం వారి జీవతం సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉంటూ భగవంతుడు ఆశీస్సులు ఉండాలని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో పినపాక నియోజకవర్గ బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మేడగం లక్ష్మీ నారాయణరెడ్డి, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు బత్తుల రామకొండారెడ్డి, గంగుల చంద్రశేఖర్‌రెడ్డి, మూల వెంకటరెడ్డి, దుగ్గిరెడ్డి బాలనారాయణరెడ్డి, నేస్తం ట్రస్ట్ సభ్యులు సంకా సురేష్, స్థానిక గ్రామస్తులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈతకా..జరభద్రం..!

- మృత్యుకుహరాలుగా మారుతున్న చెరువులు, వాగులు, కుంటలు
- ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్న వైనం
- తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటే మేలు
- సెలవు రోజుల్లో పిల్లలు జాగ్రత్త



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో సంవత్సరాల నుండి ఈతకు వెళ్లి పిల్లలు,యువకులు మృత్యువాత పడిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అనేక సంఘటనల్లో అనేక మంది విద్యార్థులు, యువకులు మృతి చెందిన విషయం విధితమే... ఈ పరిస్థితులు ఉమ్మడి జిల్లాలో సైతం ఉంది. ఈత అంటే అందరికి సరదా, వాగులో, చెరువుల్లో నీళ్లలను చూస్తే వాటిలో దిగి ఈత కొట్టాలనే కోరిక ఉంటుంది. అది పిల్లలు, పెద్దలైనా... అయితే ఇక్కడ అసలు సమస్య మొదలౌతుంది. సరదాగా ఉంటుందని నీటి లోతు ప్రదేశంలో ఈతకు దిగడంతో ప్రమాదాలు సంభవించి ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులు చూస్తున్నాం. విద్యార్థులకు పాఠశాల సెలవులు ఇచ్చిన నేపథ్యంలో, యువకులు స్నేహితులతో టూర్‌కు వెళ్ళినప్పుడు చెరువులు,వాగుల్లో స్నానాలు చేయడానికి ఇష్టపడతారు. ఈ సమయంలోనే ప్రమాదాలు పొంచి ఉంటుంది. ఈత రాకుండా జలాశయాల్లో దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. పలువురి ఈత సరదా కుటుంబాల్లో విషాదం నింపకూండ ఉండాలంటే జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం వుంది.

**జలాశయాల వద్ద తీసుకోవలసిన జాగ్రత్తలు...**

ఈత వస్తేగాని చెరువులు, కుంటలు, బావుల్లోకి దిగకూడదు. లోతు ఎంత ఉంది. ఎక్కడైన గుంతలు ఉన్నయో లేదో తెలుకొని దిగడం మంచిది. నీటిలో సాహసాలు, పోటీలు పెట్టుకోవద్దు, బాగా ఈత వచ్చిన వారితో పోటీ పడవద్దు, ఈత వచ్చిన వారు లోతుకు వెళ్ళారు అని ఈత రాని వారు లోతుకి వెళ్ళితే ప్రమాదమే. గుంపులుగా చెరువుల్లో దూకడం ప్రమాదం, బండలు, బురద ఉంటే దెబ్బలు తాకడంతో పాటు అందులో ఇరుక్కుపోయో ప్రమాదం ఉంది. వాగులో సుడిగుండాలు ఉంటాయి, అటువైపు వెళ్లకపోవడమే మంచిది. ఈత వచ్చినా ఎక్కువ సేపు నీటిలో ఉండకూడదు. శ్వాస పీల్చడం కష్టంగా ఉంటే వెంటనే బయటకు రావాలి. మునిగే వారిని కాపాడేటప్పుడు వారి జట్టును మాత్రమే పట్టుకొని బయటకు తీసుకురావాలి, అంతే గాని మనల్ని గట్టిగా పట్టే సుకుంటే ఇద్దరు మునిగిపోతారు.తల్లిదండ్రులకు తెలియకుండా పిల్లలు చెరువులకు వెళ్లకుండా చూసుకోవాలి. ఈత రాని వారు నీటిలో దిగకుండా ఉంటే మంచిది

**ఆదమరిస్తే అంతే....**

గ్రామాల సమీపంలో ఉన్న చెరువులు. ప్రాజెక్టులు, కాలువలు, బావులు, నీటిగుంతలు, ఒర్రెల వద్దకు వెళ్లి విద్యార్థులు, యువకులు ఈత సరదా కోసం వెళ్లి సాహసాలు చేస్తుంటారు. కొంత మంది ఈత రాకపోవడంతో... నీటిలోకి దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. నీటిలో ఆడుకోవడం అంటే అందరూ సరదా పడుతుంటారు. చిన్నారులైతే చెప్పాలిసిన అవసరం లేదు. అయితే లోతు తెలియక నీటిలో మునిగి చాలా మంది మృత్యువాత పడుతుండటం ఆ కుటుంబాల్లో విషాదం నింపుతుంది. పిల్లలు ఒకరిని చూసి మరొకరు నీటిలో దిగుతారు. జలకాలాట లో మునిగి తేలుతూ ఆదమరిస్తే ప్రమాదాలకు గురై కన్నవారికి దుఃఖాన్ని మిగుల్చుతున్నారు. ఈత రాని పిల్లలు, పెద్దలు నీటి వనరుల వైపు వెళ్లకుండా తల్లదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్దవాళ్లు అయితే ఒకసారి వారి కుటుంబాలను గుర్తు తెచ్చుకోవాలి. పిల్లలను తల్లిదండ్రులు ప్రతి క్షణం కనిపెడుతుండాలి. ఇలా చేయకపోవడంతో ప్రమాదాలు జరిగి ప్రాణానష్టం వాటిల్లే అవకాశం ఉంది.

## బ్రిలియంట్‌లో ఘనంగా అంబరాన్నంటిని వార్షికోత్సవ సంబురాలు





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సారపాక బ్రిలియంట్ స్కూల్, కాలేజ్ నందు 19వ వార్షికోత్సవ వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్థానిక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు, ఐఎన్‌టియూసి లీడర్ మారం వెంకటేశ్వరరెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, సీనియర్ జర్నలిస్ట్ నెహ్రూ కప్ ఫౌండర్ వెంకట బాలయోగి, సంఘ సేవకులు గాదె మాధవరెడ్డిలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ముందుగా పాఠశాల యాజమాన్యం, ముఖ్య అతిథులుగా జ్యోతి ప్రజ్వాలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఇటీవల రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి, ఒలంపియాడ్, ఎస్‌ఎఫ్ఐ చేకుముకి వంటి పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు తల్లిదండ్రులకు ఎంఎల్‌ఏ చే సన్మానం చేపించారు. అనంతరం ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడితో విద్యనభ్యసించి తల్లిదండ్రుకలు పాఠశాలకు దేశానికి మంచి పేరు తేవాలని కోరారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను గుర్తించి వారిని అత్యున్నత స్థాయికి తీసుకువెళ్లాలని, అనునిత్యం బిఎన్‌ఆర్ కృషి చేస్తూనే వారిని సంస్కృతి సంప్రదాయాలను తగినట్టుగా తయారు చేయడంలో ముందుంటారన్నారు. పిల్లలు క్రమ శిక్షణతో చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోగలరని పేర్కొన్నారు. భవిష్యత్తులో సక్సెస్ అవ్వాలంటే విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని అందుకు బ్రిలియంట్ విద్యాసంస్థ విభిన్నమైన పోటీ పరీక్షలకు విద్యార్థులను తయారు చేస్తూ వారిని యూనివర్సిటీ స్థాయిలో ప్లేస్మెంట్ ఉన్న కాలేజీలోను సీట్లు సాధించేలా చేయడం మనందరికి గర్వించ దగ్గ మరో గొప్ప విషయంగా చెప్పుకోవాలని, మన ఏజెన్సీలో విద్యార్థులకు ఇలాంటి గొప్ప అవకాశాలు కల్పిస్తూ వారిని అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నందుకు గర్వంగా ఉందంటూ బిఎన్ఆర్‌ని ఎంతగానో ప్రశంసించారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నాయకులు , పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక లారీని పట్టుకున్న పోలీసులు




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని ఎస్ఐ సుమన్ శనివారం రాత్రి పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఎస్ఐ సుమన్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మోరంపల్లిబంజర గ్రామంలో ఓ స్టాక్ పాయింట్ వద్ద అక్రమంగా ఇసుకను లారీలో తరలిస్తున్నారనే సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకుని, లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా లారీకి డిడి ఉందని సదరు లారీకి సంబంధించిన వ్యక్తులు పోలీస్ స్టేషన్‌కి వచ్చి ఎస్ఐ సుమన్‌కు చూపించారని తెలిపారు. లారీని తహసీల్దార్‌కు హ్యాండ్ ఓవర్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

## డాక్టర్ తిరుపతిరావు సేవలు అమోఘం

**సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య**






**ప్రజాపక్షం/మణుగూరుః** డాక్టర్ తిరుపతిరావు చనిపోయినా ప్రజల హృదయాల్లో ఎప్పుడూ నిలిచి ఉంటారని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య అన్నారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ తిరుపతిరావు సంతాప సభను కిన్నెర కల్యాణ మండపంలో నెల్లూరి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బి. అయోధ్య మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో డాక్టర్‌గా విశిష్ట సేవలు అందించారని, పేద వారికి వైద్యం అందించే వారిని, రాత్రి వేళలో అప్పట్లో ప్రజలకు వైద్యం అందించే వారని, ప్రజలకు అందుబాటులో ఉండేవారని, చిన్న వయసులో వారు మరణించడం దురదృష్టకరమని, వారు ఎక్కడున్నా వారి ఆత్మ శాంతి చేకూరాలని, కుటుంబసభ్యులు ధైర్యంగా ఉండాలని వారికి అండగా మేము ఉంటామని వారు భరోసా కల్పించారు. అనంతరం డాక్టర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీ కుమారి, సిపిఐ పినపాక నియోజకవర్గం కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి ఆర్ లక్ష్మీ నారాయణ, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, ఎంపీటీసీ కామిశెట్టి రామారావు, గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు సోందే కుటుంబరావు, జక్కుల రాజబాబు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించడమే లక్ష్యం

**కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం**





**ప్రజాపక్షం/పినపాకః** కిమ్స్ హాస్పిటల్ భద్రాచలం వారు అందించే ఉచిత వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కిమ్స్ హాస్పిటల్ నిర్వాహకులు చేవా శివరామకృష్ణ, బాబు రెడ్డి అన్నారు. ఆదివారం కిమ్స్ హాస్పిటల్, భద్రాచలం ఆధ్వర్యంలో పినపాక మండలం ఏడూళ్ళ బయ్యారం గ్రామ పంచాయితీ పోతిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పేదల కొరకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 500కు పైగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ కురం రవి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత ప్రజల సౌకర్యార్థం క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుపేదలున్న ప్రాంతంలో వైద్య శిభిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైద్య శిబిరంలో 18రకాల రక్త పరీక్షలు, బీపీ, షుగర్, గైనకాలజీ, ఆర్థో, ఈసీజి, ఈఎంటీ, దంత పరీక్షలు, కంటి పరీక్షలు, ఉచిత మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అన్ని రకాల వైద్య సేవలు ఒకే చోట ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పేద ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలు వినియోగించుకోవడం అభినందనీయమన్నారు. ఆరోగ్యం వ్యాపారంగా మారిన నేటి రోజుల్లో సామాజిక దృక్పథంలో పేదవారికి వైద్య సేవలు అందాలనే లక్ష్యంతో కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంత నిరుపేదలకు నాణ్యమైన వైద్యం, ఉచిత మందులు అందించడమే కాకుండా వారి గడప వద్దకు చేరుకోవాలనే లక్ష్యంతో వైద్య శిబిరాన్ని నిర్వహించిందన్నారు. ఈ వైద్య శిబిరంలో ఆదిములం కిరణ్ కుమార్ (న్యూరాలజిస్ట్), హరికృష్ణ( జనరల్ మెడిషన్), ప్రసాద్ రాజు (ఎముకలు, కీళ్లు వైద్యులు) గోళ్ళ అనూష (చర్మ వ్యాధి నిపుణులు) తో పాటు పలు రకాల వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో హాస్పిటల్ అకౌంటెంట్ వెంకటేష్, మార్కెటింగ్ మేనేజర్లు వెంకటేశ్వరరావు,రవి, హాస్పటల్ సిబ్బంది, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం, కాంగ్రెస్ నాయకుడు గట్ల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పొంచి ఉన్న ప్రమాదాన్ని నివారించండి







**ప్రజాపక్షం/కల్లూరుః** పొంచి ఉన్న ప్రమాదాన్ని నివారించాలని చెన్నూరు, పెద్ద కోరుకొండి గ్రామాల ప్రత్యేక అధికారులను కార్యదర్శులను ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పెద్ద కోరుకొండలో పాఠశాల వెంబడి కుర్నవల్లి వెళ్తున్న రహదారిలో ఎండిపోయిన చెట్టు కూలిపోయే ప్రమాదంలో ఉంది. కూలిపోయినట్లయితే విద్యుత్ తీగలు తెగి గోడ మీద కానీ, పాఠశాల మరుగుదొడ్డి మీద కానీ, మరోవైపు మెకానిక్ షాపుపై పడే అవకాశం ఉంది. పడటం వల్ల పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అదేవిధంగా ప్రధాన రహదారి నుంచి జాస్తి వారి బజారు వద్ద మోరి కుంగి, ప్రమాదకరంగా మారింది. కావున పంచాయతీ పరిపాలన అధికారి కార్యదర్శిలు స్పందించి చెట్టును తొలగించిప్రమాదాన్ని నివారించాలని పెద్ద కోరుకొండి గ్రామ ప్రజలు కోరుతున్నారు. అదే విధంగా రావికంపాడు పాఠశాల సమీపంలో ఎండిపోయిన చెట్టు రహదారి వెంబటి ఉండటం వలన విద్యుత్ తీగలపై పడి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కావున ఎండిపోయిన చెట్టును తొలగించాలని, గ్రామ ప్రజలు కోరుతున్నారు. ప్రమాదాన్ని తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యేక పరిపాలన అధికారులను, కార్యదర్శులను కోరుతున్నారు.

## బిజెపి ఎంపి అభ్యర్థిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/భద్రాచలం :** బిజేపి మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. భద్రాద్రి శ్రీ సీతారామ చంద్ర స్వామివారి దర్శనం కోసం శనివారం భద్రాచలం వచ్చిన ఆయన గర్భగుడిలోని స్వామికి పూజలు చేస్తుండగా ఆయన అనుచరులు మూల విరాట్‌ను ఫొటోలు తీశారు. వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అయ్యాయి. దీని రామభక్తుల నుండి పలు విమర్శలు ఎదురు కాగా ఆలయ ఇఓ రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో సీతారాంనాయక్‌పై కేసు నమోదు చేశారు.

## సమస్యల పరిష్కారానికి ఎంఎల్‌ఏకు వినతి



**ప్రజాపక్షం/భద్రాచలం :** పట్టణంలోని జగదీష్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావుకు కాలనీ వాసులు వినతి పత్రాన్ని అందజేశారు. సందర్భంగా ఎంఎల్‌ఏ స్పందిస్తూ వెంటనే అధికారుకు ఫోన్ చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అతిత్వరలో కాలనీలో పర్యటించి మరిన్ని సమస్యలను గిర్తించి పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని అన్ని కాలనీలు త్వరలో కలియతిరిగి నివేదికలు తయారు చేసి ప్రతీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మండల పార్టీ నాయకులు ఆకోజ్ సునీల్ కుమార్, అయినాల రామకృష్ణ, కాలనీ వాస్తవ్యులు లక్ష్మణ్ రెడ్డి, కరీంతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

## ఆర్అండ్‌బి స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి




**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండల కేంద్రం లో ఆర్అండ్‌బి స్థలాలను అక్రమంగా ఆక్రమించి, భవనాలు నిర్మించిన అతి కొద్ది మంది, చిరు వ్యాపారుల పేరుతో రోడ్డు విస్తరణకు అడ్డ పడుతుంటే అభివృద్ధిని కాదని ఆర్అండ్‌బి స్థలాలను అక్రమించిన వారికి మద్దతిస్తున్న వారి వైఖరిని ఖండించాలని ప్రజాస్వామిక వాదులను కోరుతున్నామని సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, సిపిఐ యంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు నూపా భాస్కర్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి నరాటి రమేష్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన లెఫ్ట్ పార్టీల ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్అండ్‌బి స్థలాన్ని కబ్జా చేసిన వారిని సమర్థిస్తూ అభివృద్ధికి పాటు పడాలని కోరిన కమ్యూనిస్టు నాయకుల మాటలను వక్రీకరిస్తూ అభివృద్ధికా ఆటంకంగా మారిన రాజకీయ మేధావులరా ఈవిషయాన్ని మీ విజ్ఞతకే వదిలేస్తున్నామని, ములకలపల్లి హెడ్ క్వార్టర్ మండల ప్రజలకే కాదు ఈ రోడ్డు మీద పన్ను కట్టే అందరికి హక్కు ఉంటుందని, ఒకరి ఇద్దరు కోసం ప్రజా ప్రయోజనాలు తాకట్టు పెట్టాలని చూస్తున్న వారికి గులాం గిరికి ఎవరు తల ఒగ్గరని, చట్ట ప్రకారం పోరాడుతున్నామినత లెఇపారు. చట్టం ఎవడి సొత్తు కాదని అధికారం ఎవడి సొత్తు కాదని అది శాశ్వతం కాదన్నారు. ఏది మంచో ఏది చెడో కాలం సమాధానం చెపుతుందని, ములకలపల్లిలో రోడ్డుని ఆక్రమించిన 8 మంది వారి స్వార్థ ప్రయోజనం కోసం 35వేల మందికి మేలు జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకుంటున్న రాజకీయ మేధావుల విజ్ఞతకు లాల్ సలాం, న్యాయం వైపు నిక్కార్సుగా ఆర్ అండ్‌బి చట్టంను అమలు చెయ్యాలని, మా పోరాటం ఆగదని అన్నారు. ఈకార్యక్రమంలో మాస్ లైన్ జిల్లా నాయకులు కల్లూరి కిషోర్, సిపిఎం మండల నాయకులు పూకంటి రవికుమార్, వామపక్షల పార్టీల నాయకులు అనుమల సాయి, నిమ్మల మధు, గడ్డం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలంకు పేరువంచ నుంచి పాదయాత్ర





**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండలం పేరువంచ శ్రీరామ భక్తులు పాదయాత్రన వెళ్లారు. వంద మంది మహిళా భక్తులు పురుషులు కలిసి పాదయాత్రలో తరలి వెళ్లారు. వీరికి మజ్జిగ ప్యాకెట్లు, అరటి పండ్లు గ్రామ కాంగ్రెస్ నాయకులు గోపాలరావు అందించారు. వారికి చందర్‌రావు, మధుసూదన్ రెడ్డి, కిరణ్, నరేష్, తిరుపతిరావు, మురళి, యాస శ్రీకాంత్, నోటి కృష్ణారెడ్డి, భరత్, భాగం ప్రభాకర్లు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ భక్తులు ప్రత్యేక పూజలతో ప్రారంభించి పాదయాత్రన వెళ్లారు.

# వరిధాన్యం బోనస్ ఈ సీజన్ నుంచే ఇవ్వాలి

**ప్రజాపక్షం/వైరా :** వరి ధాన్యం బోనస్ క్వింటాకు ఐదువందల రూపాయలు ఈ సీజన్ నుంచే రైతులకు అందించాలని , ధరణి , రైతు బంధు పై రైతుసంఘాలు రాజకీయ పార్టీ ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని ఈ విడత రైతుబంధు డబ్బులు ఎలాంటి మినహాయింపు లేకుండా వంద శాతం రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్ లో జరిగిన స్టడీ సర్కిల్‌లో బొంతు రాంబాబు మాట్లాడుతు నూతన ప్రభుత్వంపై రైతులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారని ధరణి సమస్యల పరిష్కారం కోసం రైతులు పెండింగ్ ధరఖాస్తులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి అధికారులు పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయడంలేదని స్థానిక రెవిన్యూ అధికారులను సంప్రదిస్తే జిల్లా కలెక్టర్ , రాష్ట్ర భూ కమీషనర్ కార్యాలయం అనుమతులు వచ్చిన తర్వాత పట్టాదారు పాసుపుస్తకాలు వస్తాయని అప్పటివరకు వేచి చూడాలని సమాధానం చెపుతున్నారని ప్రభుత్వం వెంటనే ధరణి పెండింగ్ ధరఖాస్తులు సమస్యలు పరిష్కారం చేయాలని అన్నారు. రైతుబంధు డబ్బులు విడుదలపై ప్రభ్వు ప్రకటనలు రైతులను గందరగోళం పరుస్తున్నాయని అన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఐదు ఎకరాలవరకు 92.5 శాతం రైతులకు రైతుబంధు డబ్బులు జమచేశామని ప్రకటించారు. మిగతా ఐదు ఎకరాలు దాటిన రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ సీజన్ రైతు బంధు డబ్బులు ఎలాంటి మినహాయింపు లేకుండా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. ధరణి , రైతుబంధు విధి విధానాలు రూపకల్పన కంటే ముందే రైతుసంఘాలు రాజకీయ పార్టీ ప్రతినిధులతో రాష్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశం నిర్వహించి ప్రజల అభిప్రాయం మేరకు విధివిధాలు రూపొందించాలని కోరారు. ఖమ్మం జిల్లాలో వేలాది ఎకరాల్లో ఎండిపోయిన పంటలకు ఎకరాకు 25 వేల రూపాయలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. భూ నిర్వాసితుల సమస్యల పట్ల జిల్లా మంత్రులు స్పందించాలని కోరారు. ఈకార్యక్రమంలో వైరా మాజీ ఎంపిపి బొంతు సమత, తోట నాగేశ్వరరావు , పారుపల్లి కృష్ణారావు , నారికొండ అమరేంద్ర , వడ్ల మూడి మధు , పుప్పాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# సంకల్ప బలంతోనే తలసేమియాను జయించాడు..



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సంకల్ప బలంతోనే షణ్ముక్ తలసేమియాను జయించాడని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ కోశాధికారి పి. రవిచందర్ తెలిపారు. తొమ్మిదేళ్లుగా తలసేమియాతో బాధపడుతన్న మణుగూరుకు చెందిన చిన్నారి షణ్ముక్ సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా బెంగళూరులో అతి ఖరీదైన బోన్‌మ్యారో చికిత్స అతి తక్కువ ఖర్చుతో చేయించుకుని పూర్తి ఆరోగ్యంతో ఆదివారం ఖమ్మం చేరుకున్నారు. చిన్నారి షణ్ముక్‌కు సంస్థ బాధ్యులు, వైద్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రితన్య ఆసుపత్రిలోని తలసేమియా డే కేర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రవిచందర్, వైద్యులు డి.

## షణ్ముక్‌కు బోన్‌మ్యారో విజయవంతం

నారాయణమూర్తి మాట్లాడుతూ ఎంతో ఖర్చుతో కూడుకున్న అతి పెద్ద వైద్య చికిత్సగా పేరున్న బోన్ మ్యారో చికిత్స చేయించుకున్న చిన్నారికి అభినందనలు తెలిపారు. హెచ్‌ఎల్‌ఏ 10కి 10 మ్యాచ్ అయిన చికిత్స సక్సెస్ రేటు చాలా తక్కువ అన్నారు. రాష్ట్రంలో హెచ్‌ఎల్‌ఏ ఐదుకి 10 మ్యాచ్‌తో బోన్‌మ్యారో చికిత్స చేయించుకుని విజయవంతమైన తొలి చిన్నారి షణ్ముక్ అన్నారు. ఇది సంకల్ప సంస్థ సాధించిన మరో విజయమన్నారు. ఈ చికిత్స విజయవంతమైతే చిన్నారులకు ప్రతి 20 రోజులకు రక్తం ఎక్కించుకునే అవసరం లేకుండా పోతుందన్నారు. షణ్ముక్ మరో 10 నెలలు జాగ్రత్తగా ఉండాలని, బయటి వ్యక్తులను కలువకుండా ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవాలన్నారు. సంస్థ చేస్తున్న సేవలను నమ్మి తమకు సహకరిస్తున్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ బోన్‌మ్యారో వైద్య చికిత్సను బెంగళూరు సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో తక్కువ ఖర్చుతో చేయించినట్లు తెలిపారు. చిన్నారి వైద్య ఖర్చులు, ఇతర అవసరాలకు తమ సంస్థతో పాటు మరి కొంత మంది దాతలు ముందుకు వచ్చారని వారందరికి ధన్యవాదాలు తెలిపారు. చిన్నారికి స్వాగతం పలికిన వారిలో సంస్థ ఉపాధ్యక్షులు పి. పావని, పి. ఉదయ్ భాస్కర్, పి. అనిత, ఎన్. ఉపేందర్, కృష్ణ, తలసేమియా చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఎస్ఐ వెంకటేశ్వర్లు పదవి విరమణ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న దుస్సా వెంకటేశ్వర్లు పదవి విరమణ చేశారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో జరిగిన పదవి విరమణ వీడ్కోలు సమావేశానికి ఖమ్మం నగర ఏసిపి ఎస్‌వి రమణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ 40 ఏళ్ల పాటు వెంకటేశ్వర్లు పోలీస్ శాఖలో తన విధులు నిర్వర్తించారన్నారు. ఎక్కడ పనిచేసినా అంకిత భావంతో పని చేశారన్నారు. వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఏసిపి రమణమూర్తి, సిఐ శ్రీహరి, ఎస్ఐ సురేష్, తోటి సిబ్బంది వెంకటేశ్వరరావు దంపతులను సన్మానించారు.



# సిఓఈ కళాశాలలో ప్రవేశం పొందిన గురుకుల విద్యార్థినులు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని గురుకుల పాఠశాలకు చెందిన ఆరు గురు పేద విద్యార్థులు సి ఓ ఈ గౌలి దొడ్డి హైదరాబాద్ కళాశాలలో ఉన్నత విద్యను, ఉత్తమ బోధ న అభ్యసించేందుకు ఎంపికైనట్లు గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు.



గత నెలలో సి ఓ ఈ ప్రవేశ పరీక్ష జరగగా ఫలితాలు ఆదివారం విడుదలైనట్లు ఈ ఫలితాలలో భాగంగా కళాశాలకు చెందిన ఆరుగురు గ్రామీణ పేద విద్యార్థులు ఎంపికయ్యారని వారు పేర్కొన్నారు. ఏ. జయ సింధూర, వేము మంజుల, సుకన్య, నవ్య శ్రీ,అఖిల, నిఖిత మొదటి జాబితాలో ఎంపికైనట్లు రెండో జాబితా మరికొద్ది రోజుల్లో విడుదల కానున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కల్లూరు గురుకుల కళాశాల నుండి ఆరుగురు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, వైస్ ప్రిన్సిపల్ రఘు కళ్యాణి కళాశాల సిబ్బంది మండల విద్యాశాఖ అధికారి దామోదర ప్రసాద్, తహశీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్ ఎంపీపీ రఘు, జెడ్పిటిసి అజయ్ కుమార్ లతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

# నవోదయలో ప్రతిభ చాటిన ప్రతిభ విద్యార్థులు

**ప్రజాపక్షం/కల్లూరు:** నవోదయలో (ప్రతిభ) ఆరో తరగతిలో ప్రవేశ పరీక్ష ఫలితాలలో స్థానిక ప్రతిభ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు సంబంధించిన విద్యార్థిని విద్యార్థులు ప్రతిభ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, యాజమాన్యం లక్కినేని రఘు, లక్కినేని ప్రసాద్, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు. పేద విద్యార్థులు భానోత్ సుశాంత్, భూక్య చరిష్మా నవోదయ ప్రవేశ పరీక్షల్లో జవహర్ నవోదయ ఆరో తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించారు. దీంతో మండల ప్రజలు వారిని అందించారు.



# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని గువ్వలగూడెం గ్రామం వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. మండలం లోని ముజ్జుగూడెం కు చెందిన ట్రాక్టర్ ఖమ్మం నుంచి నేలకొండపల్లి వస్తుంది...అదే సమయంలో ముదిగొండ మండలం లోని మేడేపల్లి కి చెందిన బొంత యల్లయ్య (60), బొంత వీరబాబు (45) లు బైక్ పై నేలకొండపల్లి వస్తున్నారు. గువ్వలగూడెం సమీపంలోకి రాగానే బైక్ ను ట్రాక్టర్ డీకొట్టింది. దీంతో ఎల్లయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. వీరబాబు కు తీవ్ర గాయాలైయ్యాయి. ఆయన ను మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. మృతుడు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నేలకొండపల్లి ఎస్సై తోట నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం ను పోస్టుమార్టమ్ నిర్వహించారు.




# ఫణితి వరమ్మకు పలువురు నివాళి



**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీ పరిదిలో 7వ వార్డులో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఫణితి సైదులు తల్లి ఫణితి వరమ్మ ఆదివారం మరణించారు. విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ , మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ , మున్సిపాలిటి చైర్మన్ జైపాల్ , మిట్టపల్లి నాగి , మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి , అక్కడికి వెళ్లి వరమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఫణితి సైదులు ను పరామర్శించి ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో పోటు మధు , ఫణితి వెంకటేశ్వర్లు , పాలేటి నరసింహారావు , బోళ్ల గంగారావు , యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పమ్మి అశోక్ , కన్నెగంటి నగేష్ , పెద్దపోలు లక్ష్మయ్య, రిటైర్డ్ ఏఎస్సై రామకృష్ణ తదితరులు నివాళులర్పించారు.

# సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్‌లో సీటు సాధించిన విద్యార్థులు

**ప్రజాపక్షం/ మధిర :** శనివారం విడుదల చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థులు ఇంటర్‌లో ఫ్రీ సీటు సాధించారు. మధిర పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్ విద్యార్థి బొల్లెద్దు రిషి హైద్రాబాద్ గౌలిదొడ్డి సెంట్రల్ ఆఫ్ ఎక్సెలెన్స్‌లో రెండు లెవల్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి సీటు సాధించాడు. అలాగే మండల పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన విద్యార్థి కుక్కల అభిషేక్ సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్‌లో సీటు సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆ విద్యాసంస్థల యాజమాన్యం, తదితరులు అభినందనలు తెలిపారు.



# ఫోక్సో కేసులో హెచ్ఎం అరెస్టు

**ప్రజాపక్షం /మధిర :** మధిర మున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంపై ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించి హెచ్‌ఎం సాధుసమాధానంను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు మధిర పట్టణ ఎస్సై డి.సంధ్య తెలిపారు. ఈ నెల 27వ తేదీన హెచ్‌ఎం సాధుసమాధానం 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు విద్యార్థులు తల్లిదండ్రులు మీడియా దృష్టికి తెచ్చారు. పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించిన ఫోక్సో అధికారులు శనివారం మడుపల్లి పాఠశాలకు వెళ్లి రహస్యంగా విచారణ చేశారు. దీంతో పలువురు విద్యార్థులు హెచ్‌ఎం సాధుసమాధానం తమ పట్ల అసభ్యంగా వ్యవహరించినట్లు అత్యధిక మంది విద్యార్థినిలు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో కీచక హెచ్‌ఎం సాధు సమాధానంపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం మధిర టౌన్ ఎస్ఐ సంధ్య హెచ్‌ఎం సాధు సమాధానంపై ఫోక్సో కేసు నమోదైనట్లు, హెచ్‌ఎంను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.